



APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L.22/VNEWS/25-27






సంపుటి :12 సంచిక : 68 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, ఏలూరు, గుంటూరు, తెలంగాణ, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 06-10-2026 మంగళవారం పేజీలు :8 వెల : రూ.3/-

## పౌర సేవల్లో నాణ్యతకు సామర్థ్యమే కీలకం

**- రెండున్నరేళ్లలో గృహ నిర్మాణం లక్ష్యాల పూర్తికి కార్యాచరణ**
**- రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ కనెక్షన్లు లక్ష్యంగా ప్రణాళిక**
**- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి :** ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెరగాలంటే ఉద్యోగుల సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కెపాసిటీ బిల్డింగ్ కమిషన్, మిషన్ కర్మయోగి పోర్టల్, ఉన్నతి ద్వారా అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్‌తో పాటు ఐఐఎంలు, ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఆఫ్‌లైన్ శిక్షణ కూడా పొందాలన్నారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీజీఎస్ సమీక్షలో భాగంగా వివిధ శాఖలు అందిస్తున్న పౌర సేవలపై ముఖ్యమంత్రి సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య పెంపునకు ఐగాట్ మిషన్ కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సీఎం తెలిపారు. ఓ సెకండరీ గ్రేడ్ టీచర్ ఏకంగా 4,200 కోర్సులు పూర్తి చేసి తన సామర్థ్యాన్ని పెంచుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉద్యోగులు తమ విధులకు సంబంధించిన అంశాలతో పాటు ఆధునిక సాంకేతికత, పరిపాలన, ప్రజాసేవకు సంబంధించిన కోర్సులను అభ్యసించాలని సూచించారు. సానుకూల ప్రజాభిప్రాయాన్ని పెంచుకోవడంలో వెనుకబడిన శాఖలు, విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. సామర్థ్య పెంపుతో పాటు ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం పెరిగేలా శాఖలు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. త్వరలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానని సీఎం వెల్లడించారు.

**గుంతల పూడ్చివేతకు ఆధునిక సాంకేతికత**

రహదారులపై గుంతల పూడ్చివేతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గుంతలు పూడ్చడంతో పాటు రహదారుల నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. బిటుమిన్ లభ్యత, ఫ్లైయాష్ అందుబాటులో ఉన్న పరిమాణంపై అధికారులను ఆరా తీశారు. ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి గమ్యస్థానాలకు చేరేలా షెడ్యూలింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం చేపట్టిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణంతో పాటు మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. వచ్చే రెండున్నర ఏళ్లలో నిర్దేశించుకున్న గృహ



నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందని, దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను త్వరగా గుర్తించాలని చెప్పారు. ఎక్కడా డూప్లికేషన్ లేకుండా వన్ ఫ్యామిలీ.. వన్ హౌస్ విధానంలో అర్హులకు వేగంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆదేశించారు.

**సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు లక్ష్యాన్ని చేరుకోవాలి**

జల్ జీవన్ మిషన్ ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే లక్ష్యాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ పెంచేందుకు అవసరమైన ప్రాంతాల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే 4.1 లక్షల కనెక్షన్లతో దేశంలో నాలుగో స్థానంలో ఉన్నామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలపైనా సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటుతో 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఉందని వివరించారు. కుప్పం నియోజకవర్గంలో మొత్తం ప్రాంతాన్ని ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇళ్లకు సోలార్ కనెక్షన్లు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం ఆదేశించారు.

**పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ**

రాష్ట్రంలో రానున్న పెట్టుబడులకు అనుగుణంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని సీఎం సూచించారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు అందించాలని చెప్పారు. పీఎం సేతు--ఆర్సెలార్ మిట్టల్ స్కిల్ సెంటర్ ద్వారా మెరుగైన శిక్షణ అందించాలని, ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఉద్యోగ అవకాశాల కల్పన నిరంతర ప్రక్రియగా ఉండాలని, యువతకు ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కూడా నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. నైపుణ్య పోర్టల్‌ను ఇతర వ్యవస్థలతో సమగ్రంగా అనుసంధానం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు రెవెన్యూ, ఆర్థిక, ఐటీ, మహిళా శిశు సంక్షేమం, సెర్ప్, రవాణా, దేవాదాయ, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు

## సీఈసీ ఏకపక్ష నిర్ణయాలపై సుప్రీం సీరియస్

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేయాలన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. అయితే ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నారా? లేక సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపై ఈసీతో పాటు సీఈసీ, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలకు నోటీసులు జారీ చేసింది.



**ఏకాభిప్రాయంతోనే నిర్ణయాలా?**

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు సాధారణంగా ఏకాభిప్రాయంతో ఉండాలని సీజేఐ స్పష్టం చేశారు. ఏకాభిప్రాయం కుదరకపోతే మెజారిటీ ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**సీఈసీపై ఆరోపణలేమిటి?**

ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జ్ఞానేశ్ కుమార్ ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని పిటిషనర్ల ఆరోపణ. ఈ నేపథ్యంలో సీఈసీని సస్పెండ్ చేయడంతో పాటు ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు సుప్రీంకోర్టును కోరారు.

**14 సార్లు అభ్యంతరాలు?**

'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన కథనాన్ని పిటిషనర్లు ప్రస్తావించారు. 2025 అక్టోబర్ నుంచి 2026 ఆగస్టు మధ్య ఎస్ఐఆర్‌కు సంబంధించిన పలు చర్యల విషయంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీ కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు నమోదు చేసినప్పటికీ, ఎన్నికల సంఘం పేరుతో నిర్ణయాలు తీసుకున్నట్లు ఆ కథనం పేర్కొంది.

**రికార్డులను పరిశీలిస్తాం**

కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం రికార్డుల్లో కొన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకోలేదని తేలితే, వాటి అమలును నిలిపివేసి అవి చట్టపరంగా చెల్లుబాటు కావని ప్రకటించే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం సభ్యుల నుంచి వివరణ కోరారు.

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను సస్పెండ్ పై సుప్రీంకోర్టు షాక్**
**సస్పెన్షన్‌కు నో.. నోటీసులతో విచారణ**

అయితే ప్రస్తుత దశలో జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. ఎన్నికల సంఘం, సీఈసీ, ఇతర ఇద్దరు కమిషనర్లకు నోటీసులు జారీ చేసి వారి వివరణ కోరింది. కేసు విచారణ కొనసాగనుంది.

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**అమెరికా :** 2026 ఏడాదికి గానూ నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారం నుంచి ప్రారంభమైంది (ఙష్ట్రవ చీశీఎవశ్రీ ూతీఱఓవ 2026). వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ వరించింది. కాంతి నియంత్రిత అయాన్ ఛానల్స్, ఆప్టోజెనెటిక్స్‌కు సంబంధించిన ఆవిష్కరణలకు గానూ కార్ల్ డిసెరోథ్, పీటర్ హెగెమన్, జార్జ్ నగెల్‌కు నోబెల్ కమిటీ ఈ అవార్డును ప్రకటించింది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యంలో విశేష కృషి చేసిన వారి పేర్లను వెల్లడించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్‌పై ప్రకటన రానుంది. నోబెల్ ప్రైజ్ మనీ విలువ 12 లక్షల డాలర్లు (రూ.11.5 కోట్లు).




నోబెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీడన్ – నార్వే దేశాలకు చెందిన నాలుగు వేర్వేరు స్వతంత్ర సంస్థలు వేర్వేరు రంగాల్లో విశేష కృషి చేసిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేస్తాయి. 1901 నుంచి స్వీడన్ శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం వీటిని ఇస్తోన్న సంగతి తెలిసిందే.

## భారతీయ నావికులున్న నౌకపై రష్యా డ్రోన్ల దాడి: జెలెన్‌స్కీ

**ఉక్రెయిన్ :** నల్ల సముద్రంలో తుర్కియేకు చెందిన ఓ సరకు రవాణా నౌకపై రష్యా డ్రోన్లతో దాడి చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఆ నౌకలో భారతీయులు, అజర్‌బైజాన్ పౌరులు ఉన్నారని వెల్లడించారు. దాడి కారణంగా నౌకలో మంటలు చెలరేగాయని తెలిపారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారని, మరో 11 మందిని సహాయక సిబ్బంది కాపాడారని చెప్పారు.

"నల్ల సముద్రంలో మొక్కజొన్నల లోడ్‌తో ప్రయాణిస్తున్న తుర్కియేకు చెందిన నౌకపై రెండు రష్యన్ డ్రోన్లు భీకర దాడికి పాల్పడ్డాయి. ఆ నౌకలో భారతీయ, అజర్‌బైజాన్ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో నౌక కెప్టెన్ ప్రాణాలు కోల్పోయారు. మరో వ్యక్తి పరిస్థితికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. 11 మంది సిబ్బందిని రక్షించారు.

నల్ల సముద్రంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు, భద్రతను నిర్ధారించేందుకు ఉక్రెయిన్‌తోపాటు ఇతర దేశాల నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చాయి. కానీ.. రష్యా మాత్రం ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడటంతోపాటు నౌకలను ముంచేయాలనే చేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహార భద్రతను పునరుద్ధరించేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకురావడం అత్యవసరం" అని జెలెన్‌స్కీ 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

మరోవైపు.. రొమేనియా తీరానికి 55 కి.మీ. దూరంలో నల్ల సముద్రంలో ఓ వాణిజ్య నౌకలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు ఆ దేశ అధికారులు తెలిపారు. 11 మంది సిబ్బందిని రక్షించినట్లు చెప్పారు. అనంతరం ఆ నౌక మునిగిపోయినట్లు ప్రకటించారు. అయితే, జెలెన్‌స్కీ ప్రస్తావించిన నౌక, రొమేనియా చెబుతున్న నౌక ఒకటేనా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

## బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: రాహుల్

**దిల్లీ :** ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి దిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. దిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కోవడంతో పాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని



ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు.

"మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

V న్యూస్

# ఎండ-ఎకానమీ

ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలే ఎండ భారాన్ని ఎక్కువగా మోస్తున్నాయనేది ఇక్కడ కనిపించే లోతైన అసమానత.

ప్రపంచంలోని అత్యంత వేడిగా ఉన్న 50 నగరాల్లో 26 భారత్‌లోనే ఉన్నాయని క్లైమేట్ సెంట్రల్ అధ్యయనం వెల్లడించింది. మే 21న దేశ విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్లకు చేరి కొత్త రికార్డు నెలకొల్పింది. ఇవి కేవలం వాతావరణ గణాంకాలు మాత్రమే కాదు... నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, డెలివరీ రైడర్లు, ఆటో డ్రైవర్లు, వీధి వ్యాపారులు, పారిశుద్ధ్య కార్మికులు వంటి కోట్లాది మంది జీవనోపాధిపై ప్రత్యక్ష ప్రభావం చూపే ఆర్థిక సంకేతాలు.

ఇంతకాలం ఎండ తీవ్రతను వాతావరణ శాఖ హెచ్చరికగా, ఆరోగ్య శాఖ సమస్యగానే చూశాం. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) దృష్టిలో మాత్రం ఇది ఆర్థిక వ్యవస్థను కుదిపేసే అంశం. భారత శ్రామిక శక్తిలో సుమారు 75 శాతం మంది... వేడి ప్రభావానికి గురయ్యే వృత్తుల్లోనే ఉన్నారు.

2030 నాటికి ఉత్పాదకత తగ్గుదల కారణంగా 3.4 కోట్ల ఉద్యోగాలకు సమానమైన శ్రామిక సామర్థ్యం కోల్పోవచ్చని ఐఎల్‌ఓ అంచనా వేస్తోంది. ప్రపంచ బ్యాంకు మాత్రం భారత జీడీపీలో 4.5 శాతం (సుమారు 150--250 బిలియన్ డాలర్లు) 2030 నాటికి ప్రమాదంలో పడొచ్చని హెచ్చరిస్తోంది.

తీవ్రమైన వేసవి రోజుల్లో అసంఘటిత కార్మికులు తమ ఆదాయంలో 40 శాతం వరకు కోల్పోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు ఏటా 24 పని దినాలను కోల్పోతున్నారు. ఇది ఒక్కసారి జరిగిపోయేది కాదు. ప్రతి ఏటా పునరావృతమయ్యే, నిశ్శబ్దంగా పేదరికాన్ని మరింత లోతు చేసే ప్రక్రియ.

దేశంలో ఒక్క తీవ్రమైన ఎండ రోజునే సుమారు 3,400 అదనపు మరణాలు సంభవిస్తున్నాయని 2026 అధ్యయనం అంచనా వేసింది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్ -- ఈ అయిదు రాష్ట్రాల్లో దేశ జనాభాలో 43 శాతం ఉండగా, వడగాల్పు మరణాల్లో 60 శాతానికి పైగా ఇక్కడే నమోదవుతున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలే ఎండ భారాన్ని ఎక్కువగా మోస్తున్నాయనేది ఇక్కడ కనిపించే లోతైన అసమానత.

తెలంగాణ ప్రభుత్వం వడగాల్పును 'రాష్ట్ర ప్రత్యేక విపత్తు'గా ప్రకటించి మృతుల కుటుంబాలకు పరిహారాన్ని రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షలకు పెంచింది. తెలంగాణ కార్మిక సంఘాల ప్రకారం... ప్రభుత్వ ప్రణాళికలు, పథకాలు స్థానిక భాషల్లో కార్మికులకు చేరడం లేదు. నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు ఇప్పటికీ తగిన రక్షణ లేకుండానే పనిచేస్తున్నారు. ఆహార పంపిణీ కార్మికులు, ద్విచక్ర వాహన రైడర్ల ఆదాయం రోడ్డుపై గడిపే గంటలపైనే ఆధారపడి ఉంటుంది. వీరికి కనీస వేతన హామీ లేదు, సామాజిక భద్రతా రక్షణ ఇంకా పరిమితంగానే ఉంది. 3

ఒక విధాన ప్రశ్న

పరిష్కారం 'నీళ్లు తాగండి, నీడలో ఉండండి' అనే హెచ్చరికలకే పరిమితం కాకూడదు. ఇది శ్రామిక విధానానికి సంబంధించిన ప్రశ్న. మధ్యాహ్నం 12--3 గంటల మధ్య బహిరంగ నిర్మాణ పనులను నిషేధించే చట్టం-- ఖతార్, యూఏఈ వంటి దేశాలు అమలు చేస్తున్నాయి. భారత్‌లోనూ తీసుకురావాలి. ప్రతి నిర్మాణ సైట్‌లో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను తప్పనిసరి చేయాలి. 45 డిగ్రీలు దాటిన రోజుల్లో కార్మికుల ఆదాయ నష్టానికి ప్రభుత్వమే బీమా లేదా పరిహార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సమన్వయంతో ఎండ తీవ్రతను వాతావరణ హెచ్చరికగా మాత్రమే కాకుండా, జాతీయ ఆర్థిక ప్రణాళికలో కీలక ప్రమాద అంశంగా పరిగణించడం అత్యవసరం. థర్మామీటర్‌లో వేడి పెరిగిన కొద్దీ పేదరికం పెరుగుతోంది. ఈ ఎండ నిశ్శబ్దంగా భారత్ ఆర్థిక పునాదిని కరిగిస్తోంది. ప్రతి సంవత్సరం పునరావృతమయ్యే ఈ సంక్షోభాన్ని ఇక వాతావరణ వార్తగా కాకుండా, జాతీయ ప్రాధాన్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# కరగ్రహారంలో దోమల నివారణ చర్యలు

**(వి న్యూస్ – మచిలీపట్నం):** పెద్ద కరగ్రహారం చిన్న కర్రగహారం గ్రామాలలో ముందు జాగ్రత్త చర్యలు భాగంగా దోమల నివారణలో భాగంగా ఎబెట్ స్ప్రే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బత్తిన నాగరాజు, బుర్ర రాము, జిల్లా మలేరియా



అధికారి సబ్ యూనిట్ ఆఫీసర్, పి. మురళి తాళ్లపాలెం పి హెచ్సి ఎం పి హెచ్ ఓ కృపారావు, ఎంపీహెచ్ఎస్ ఆకోరి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ పి వి సుబ్బారావు, ఏఎన్ఎం భవాని, ఆశా వర్కర్స్ పెద్ద కరగ్రహారం పంచాయతీ సెక్రెటరీ పరస శ్రీహరి పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, ప్రజల పట్ల మర్యాద, విధి నిర్వహణలో నిబద్ధతే పోలీస్ శాఖకు ప్రధాన బలం : జిల్లా ఎస్పీ

**(వి న్యూస్ – మచిలీపట్నం):** కృష్ణా జిల్లాకు 9 నెలల ప్రాథమిక పోలీస్ శిక్షణ పూర్తి చేసుకొని కేటాయించబడిన 136 మంది ప్రొబేషనరీ కానిస్టేబుళ్లకు(40 మంది మహిళలు, 96 మంది పురుషులు) జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) వి.వి. నాయుడు తో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ కాలంలో కానిస్టేబుళ్లు నేర్చుకున్న చట్టాలు, పోలీస్ విధులు, డ్రిల్, ఆయుధ వినియోగం, నేర దర్యాప్తు, శాంతిభద్రతల నిర్వహణ, సైబర్ నేరాలపై అవగాహన తదితర అంశాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే పరిస్థితులు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలపై వారికి పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలోకి అడుగుపెట్టిన నాటి నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం, బాధ్యతాయుత ప్రవర్తనతో విధులు నిర్వహిస్తూ పరిపూర్ణ పోలీస్ సిబ్బందిగా ఎదగాలని సూచించారు. పోలీస్ సిబ్బంది వ్యవహరించే తీరు, ప్రజలతో మాట్లాడే విధానం, విధి నిర్వహణలో చూపించే నిబద్ధత ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సైబర్ నేరాలు, ఐటీ సంబంధిత నేరాలపై ప్రాథమిక అవగాహనతో పాటు వాటి నియంత్రణ, దర్యాప్తు విధానాలపై నిరంతరం పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు. పోలీసుల



విధుల్లో ప్రజా సంబంధాలు అత్యంత కీలకమని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సానుభూతితో విని చట్టపరిధిలో పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. బాధితులకు భరోసా కల్పిస్తూ, న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడం ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. అదేవిధంగా విధి నిర్వహణలో చట్టపరమైన పరిజ్ఞానం, సమయస్ఫూర్తి, పరిస్థితులను అంచనా వేసే సామర్థ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని, తమకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహించాలని తెలిపారు. పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం, విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణా రాహిత్యం లేదా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడటం ఏమాత్రం సహించేది లేదని, అటువంటి ప్రవర్తనకు పాల్పడే వారిపై శాఖాపరమైన మరియు చట్టపరమైన నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూనిఫాం కేవలం ఉద్యోగానికి గుర్తు కాదు ప్రజల భద్రత కోసం మన పై ఉంచిన బాధ్యతకు ప్రతీక. ప్రజల విశ్వాసాన్ని కాపాడుతూ, నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎన్ సి సి కోసం ఎన్‌రోల్‌మెంట్

**(వి న్యూస్ – మచిలీపట్నం):** కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లో సోమవారం ఎన్ సి సి లో చేరుట కోసం ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కృష్ణా విశ్వవిద్యాలయ ఎన్ సి సి యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కె. సుందర కృష్ణ పాల్గొని కార్యక్రమాన్ని ప్రోత్సహించారు.

ఈ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని 16(ఎ) బెటాలియన్ ఎన్ సి సి అసోసియేటెడ్ ఆఫీసర్ (ఎ ఓ) లెఫ్టినెంట్ కల్నల్ చందన్ ఠాకూర్ సార్ పర్యవేక్షణలో,పి1 సిబ్బంది సుబేదార్ సురేష్ పాటిల్ సాబ్, హవల్దార్ బషీర్ అహ్మద్ సాబ్, అలాగే కృష్ణా విశ్వవిద్యాలయ అసోసియేట్ ఎన్ సి సి ఆఫీసర్ (ఎ ఎన్ ఓ) లెఫ్టినెంట్



డాక్టర్ డి. రామశేఖర రెడ్డి సార్ సమన్వయంతో నిర్వహించారు.

ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు శారీరక దృఢత్వ పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను క్రమశిక్షణతో, సజావుగా నిర్వహించేందుకు ఎన్ సి సి కేడెట్లు అధికారులకు సహకరించారు. ఈ సందర్భంగా ఎన్ సి సి అధికారులు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన పెంపొందించడంలో ఎన్ సి సి పాత్రను వివరించారు. కార్యక్రమంలో ఎన్ సి సి కేడెట్లు ఉత్సాహంగా పాల్గొని, ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఎన్ సి సి పట్ల ఆసక్తి పెరగడంతో పాటు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల ప్రాముఖ్యత పై అవగాహన ఏర్పడింది.

# నారాయణ ఈచాంప్స్‌లో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

**(వి న్యూస్ – మచిలీపట్నం):** స్థానిక శిడింబి అగ్రహారం లో గల నారాయణ ఒలింపియాడ్ స్కూల్ లో ఈ చాంప్స్ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మా పిల్లలు – మా వాయిస్ – మా భవిషత్తు అనే నినాదంతో విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ,సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికితీసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా క్లస్టర్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ఈ చాంప్స్ కోఆర్డినేటర్ లియోని, ప్రిన్సిపాల్ సి హెచ్ సాయి సుధీర్, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎం దివ్య వాణి, పి ఈ టి విజయ్, ఏవో విశ్వనాధపల్లి రవికుమార్,ఉపాధ్యాయులు, విద్యార్థినీ – విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన నారాయణ ఈ చాంప్స్ కోఆర్డినేటర్ లియోని మాట్లాడుతూ విద్యార్థులే స్వయంగా సదస్సును నిర్వహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం,సృజనాత్మకత,కొత్త ఆలోచనలు పెంపొందుతాయని అన్నారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) లాంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తు కు



బలమైన పునాది కల్పిస్తాయి అన్నారు. క్లస్టర్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక జ్ఞానం తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. నారాయణ విద్యా సంస్థలు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధితో పాటు వారి నాయకత్వ లక్షణాలను మెరుగుపరిచే కార్యక్రమాలను రూపొందించి నిర్వహిస్తుంది అన్నారు. ఈ చాంప్స్ విద్యార్థులు చిన్న వయస్సులోనే అద్భుతముగా ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో గర్వంగా ఉన్నది అన్నారు. ప్రిన్సిపాల్ సి. హెచ్. సాయి సుధీర్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చిన్న వయస్సులోనే ఎంతో ఆత్మవిశ్వాసం తో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉన్నది అన్నారు. పిల్లలలో సృజనాత్మకతను ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల కృషి,తల్లిదండ్రుల సహకారం అభినందనీయమన్నారు. చిన్న అడుగులు – పెద్ద కలలు అన్న థీమ్ తో విద్యార్థులు తాము ఎంచుకున్న అంశముపై సృజనాత్మకంగా ఇచ్చిన ప్రతిభా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. నేర్చుకోవడం – పంచుకోవడం – కలసి చదువుకోవడం అనే ఉద్దేశంతో ఉదయం నుండి సాయంత్రం వరకు అత్యంత ఆనందోత్సాహములతో సాగిన ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) ను ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షించి విద్యార్థులను అభినందించారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ లో అతిథులను ఘనముగా సత్కరించిన అనంతరం వైస్ ప్రిన్సిపాల్ ఎం దివ్య వాణి ఓట్ ఆఫ్ థాంక్స్ చెప్పడము తో కార్యక్రమాన్ని ముగించారు.

# ప్రొద్దుటూరులో రూ.30 వేల కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శ్రీకారం

**(వి న్యూస్ – ప్రొద్దుటూరు):** రాష్ట్రంలో తాగునీటి కొరతకు శాశ్వతంగా తెరదించే దిశగా కూటమి ప్రభుత్వం చారిత్రక అడుగు వేసిందని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ఇంటి వద్దనే సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార బృహత్తర కార్యక్రమానికి వైఎస్‌ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు కేంద్రంగా సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సంయుక్తంగా పైలాన్,శిలాఫలకాలను ఆవిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న తాగునీటి అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని వక్తలు అభివర్ణించారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కోసం మహిళలు, చిన్నారులు కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఉండేది. దీనికి శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రాబోయే 30 ఏళ్ల జనాభా పెరుగుదల, నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సమగ్ర




ప్రణాళికను రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 32 సమగ్ర తాగునీటి సరఫరా పథకాలు, 50,283 ఏక గ్రామ తాగునీటి పథకాలు చేపట్టనున్నారు. దీని ద్వారా సుమారు 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ఒక్కో వ్యక్తికి రోజుకు సగటున 55 లీటర్ల సురక్షిత నీటిని అందించడం లక్ష్యం. పథకంలో భాగంగా 1,426 ఎంఎల్డీ సామర్థ్యంతో అత్యాధునిక నీటి శుద్ధి కేంద్రాలు, 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కిలోమీటర్ల మేర పైప్ లైన్లు, 27.36 లక్షల ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు.

# మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లో కొనసాగించాలి




**(వి న్యూస్ – మచిలీపట్నం):** గత 5 సంవత్సరాల నుండి మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లో స్వచ్ఛ భారత్ ఇంటింటికి చెత్త సేకరణలో భాగంగా పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లను వెంటనే విధుల్లో కొనసాగించాలి, వారికి పెండింగ్ లో ఉన్న 2 నెలలు వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లో కొనసాగించాలని కోరుతూ ఫైర్ స్టేషన్ వద్ద నుండి కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్ వరకు ర్యాలీ, ధర్నా చౌక్ లో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం కలెక్టర్ కి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లో గత 5 సంవత్సరాల నుండి ఎండానక వాననక, కరోనా సందర్భంలో సైతం ప్రాణాలకు లెక్కచేయకుండా విధులు నిర్వహించిన క్లాప్ ఆటో డ్రైవర్లను ఈరోజు కూటమి ప్రభుత్వం విధులనుండి తొలగించడం అన్యాయమని వారికి రావలసిన పెండింగ్ బకాయిలను, 2నెలల జీతాలు చెల్లించి, వారిని విధుల్లో కొనసాగించాలని ఆయన కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది. కృష్ణాజిల్లాలో ఇదే కాంట్రాక్ట్ కింద మిగతా మున్సిపల్ లో పనిచేస్తున్న క్లాప్ ఆటోడ్రైవర్ విధుల్లో కొనసాగుతున్న కేవలం మచిలీపట్నంలోని కక్ష సాధింపు చర్యలో భాగంగా ఇక్కడ డ్రైవర్ నిలుపుదల చేయడం అన్యాయం అని ఆయన అన్నారు. ఈరోజు క్లాప్ ఆటోలు లేకపోవుట వలన పట్టణ పట్టణంలో అనేక చోట్ల చెత్త పేరుకున్న పరిస్థితి అదే విధంగా రాబోయే వర్షాకాలంలో అనేక వ్యాధులు ప్రబలే ఈ కాలంలో పారిశుధ్యని మెరుగుపరుచుటకు వెంటనే తగు చర్యలు తీసుకుని క్లాప్ ఆటోల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. యూనియన్ ఉపాధ్యక్షులు సిహెచ్ బుల్లెమ్మ మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యనికి ఉపయోగపడుతున్న క్లాప్ ఆటో డ్రైవర్లను కొనసాగించే అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె డిమాండ్ చేశారు. ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు టి చంద్రపాల్ మాట్లాడుతూ కార్పొరేషన్ లో గత ఐదు సంవత్సరానికి పనిచేస్తూ ఈరోజు సడన్గా వారిని నిలుపుదల చేయడం వల్ల 43 కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితి కాబట్టి ప్రభుత్వం ఈ 43 మంది కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన అధికారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మచిలీపట్నం కన్వీనర్ సిహెచ్. జయ రావు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాజేష్ సంఘీభావం తెలియజేస్తూ మాట్లాడటం జరిగింది.

# 50 మంది బోటు యజమానులకు కి ఆయిల్ కార్డులను అందజేసిన గోపు



**(వి న్యూస్ – కానూరు):** మచిలీపట్నం మండలం పెద్ద కానూరు గ్రామం లోని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో బోటు యజమానులకు 50 మందికి ఆయిల్ కార్డులను అందచేశారు. ఒక్క లీటరు డీజిల్ కి 9 రూపాయలు సబ్సిడీని అందిస్తున్నామని తెలిపారు. మోటారైజ్డ్ బోటులకు నెలకు 300 వందల లీటర్ల డీసెల్ ను అందిస్తున్నారని తెలిపారు. మన కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారుల కొరకు వేట నిషేధ సమయంలో వేటకు వెళ్లేవారికి 20,000/- వేట నిషేధ భృతి అందించమని తెలిపారు. మన కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం వివిధ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ బండి వీరస్వామి, పీత రాము, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, బోటు యజమానులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మం ఉన్న దగ్గరే విజయం ఉంటుంది

**(వి న్యూస్ – రేపల్లె):** ధర్మం ఉన్న దగ్గరే విజయం ఉంటుందని సంస్కృత పండితులు, అవధాని డాక్టర్ దోర్బల ప్రభాకర శర్మ అన్నారు. రేపల్లె శ్రీ శృంగేరి శంకరమఠంలో మాసం మాసం మానసోల్లాసం సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి- మైత్రి బంధం అంశంపై జరిగిన ప్రవచనంలో దోర్బల ప్రభాకర్ శర్మ మాట్లాడారు.



ఈ సందర్భంగా జరిగిన సభకు సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు హరి అన్నయ్య శాస్త్రి అధ్యక్షత వహించారు. డాక్టర్ ప్రభాకర్ శర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అనేది ఐదు వేల సంవత్సరాల కంటే ఎక్కువ చరిత్ర కలిగిన ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన వైవిధ్య భూషితమైన విధానం అన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి బలమైన పునాదిగా నిలుస్తుంది అన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడం బాధాకరమన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలకు సంస్కృతి సంప్రదాయాల పట్ల మక్కువ కలిగి విధంగా నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పాశ్చాత్య సంప్రదాయాలను మనం ఆచరించడం సరైన విధానం కాదని చెప్పారు. తల్లిదండ్రులు, పిల్లలు కలిసిమెలిసి జీవించే పరిస్థితులకు నేడు తిలోదకాలు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. మనం పిల్లలను ఇంగ్లీష్ మీడియం లో చదవమని గట్టిగా చెప్తున్నట్లుగానే, భారతీయ ధర్మం పట్ల, సంస్కృతి పట్ల కూడా పిల్లలకు విడమర్చి చెప్పినట్లయితే వారు ఆచరిస్తారని, ఆ బాధ్యత తల్లిదండ్రుల దయను అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమైనప్పటికీ, ఏ మేరకు అవసరమో అంతవరకే ఉపయోగించుకోవాలన్నారు. సంస్కృత భాషను పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మాన్ని ఆచరించే విధంగాను, సత్యాన్ని పలికే విధంగాను, నీతివంతమైన జీవితాన్ని గడిపే విధంగా పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, గురువులు ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. సమిష్టి కుటుంబాల ద్వారానే భారతీయ జీవన విధానం నిలుస్తుందన్నారు. వ్యాస మహర్షి మొత్తం రచనలకు కేంద్ర బిందువు ధర్మమని చెప్పారు. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ విజయం ఉంటుంది( యతో ధర్మస్థతో జయః ) అని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి సమాజంలో, కుటుంబంలో తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే భారతీయ విధానంలో అసలైన ధర్మం అన్నారు. స్వార్థాన్ని వీడి సమాజ శ్రేయస్సు కోసం జీవించడమే ఉత్తమ మార్గమని దోర్బల ఉద్ఘాటించారు. వ్యాసుల వారు తాము రాసిన 18 పురాణాల సారాన్ని కేవలం ఒకే ఒక్క శ్లోకంలో వివరిస్తూ అష్టాదశ పురానేషు వ్యాసస్య వచన ద్వయం.పరోపకారః పుణ్యాయ పాపాయ పర పీడనం అంటే పరోపకారం (ఇతరులకు సహాయం చేయడం) కంటే పెద్ద పుణ్యం లేదు, పరపీడనం (ఇతరులను బాధించడం) కంటే పెద్ద పాపం మరొకటి లేదు. ఇదే భారతీయ జీవన విధానానికి మూలస్తంభం అని చెప్పారు. భారతీయ సంస్కృతిలో సత్యం, ఓర్పు, క్షమా వంటి గుణాలకు వ్యాసుడు అగ్ర తాంబూలం ఇచ్చారన్నారు. మనం కూడా మన పిల్లల్లో ఈ గుణాలను అలవర్చే విధంగా చూడాలన్నారు. సత్యమే అన్ని ధర్మాల కంటే నిన్న అయినదని యుధిష్టరుడు (ధర్మరాజు) పాత్ర ద్వారా చూపించారు. వ్యాసుల వారు అందించిన జీవన సూత్రాలే నేటికీ భారతదేశ సంస్కృతికి, నైతిక విలువలకు వెన్నెముకగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం డాక్టర్ దోర్బల ప్రభాకర శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృత పండితులు, అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, పొన్నూరు ప్రతిమాసం వాణి దరహాసం సంస్థ అధ్యక్షులు నాగలింగం హరిహర పంత్ శివాచార్య, గౌరవ సలహాదారు పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్, కన్వీనర్ ఎం కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షులు సురా రామారావు, తెలుగు పండితులు, సాహిత్యాభిమానులు, సాహిత్య పోషకులు, కళాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

V స్మార్ట్ యాడ్స్

Insurance
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్.
9246761404
08672-221097

మస్కిటో డోర్స్&విండోస్
చక్రిస్
మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును.
సంప్రదించండి:
చక్రిస్
మస్కిటోడోర్స్&విండోస్
గొడుగుపేట-మచిలీపట్నం
సెల్:9182197822
9121605277

వి స్మార్ట్ యాడ్స్
కేవలం
రూ.100/-లకే
స్మార్ట్ యాడ్..
సంప్రదించండి
9848667347

చెదల నివారణకు
K. Vasantha Rao




Cell: 8333099449
నివారణ గ్యారెంటీ...
మచిలీపట్నం.

శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును.
సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి :
96407 54054-91828 17435

తక్కువధరకే ప్రకటనలు
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో వి న్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి.
మరిన్ని వివరాలకు సంప్ర:
9848667347

# జిల్లాలో సమగ్ర కాలుష్య నివారణ కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి

**(వి న్యూస్ – మచిలీపట్నం):** జిల్లాలో వాయు, నీటి, పారిశ్రామిక, ప్లాస్టిక్, మురుగునీరు, నిర్మాణాల దుమ్ము, వాహనాలు, శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు సమగ్ర కాలుష్య నివారణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పటిష్టంగా అమలు చేయాలని జనతా వారధి జిల్లా కో కన్వీనర్ గంటా సతీష్ , జిల్లా ఇంచార్జి కలెక్టర్ ని కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ కాలుష్యం ప్రజల ఆరోగ్యం, తాగునీరు, వ్యవసాయం, పర్యావరణం, భవిష్యత్ తరాల భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కాలుష్యం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తుగా ప్రమాద ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, అధిక ప్రమాద పరిశ్రమలపై నిరంతర పర్యవేక్షణ, పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో గాలి--నీటి నాణ్యత పరీక్షలు, బహిరంగ చెత్త దహనం నివారణ, నిర్మాణాల దుమ్ము నియంత్రణ, నీటి కాలుష్యానికి మూలాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే కాలుష్య ఫిర్యాదులకు టైం బౌండ్ రెస్పాన్స్ విధానం ఏర్పాటు చేసి, ఫిర్యాదు నమోదు నుంచి



స్థల పరిశీలన, నమూనాల పరీక్ష, చర్యలు,ఆక్షన్ టేకెన్ రిపోర్ట్ వరకు పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని నాగేంద్ర కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎ పి పి సి బి , మున్సిపల్, పంచాయతీ రాజ్, పరిశ్రమలు, రవాణా, ఆరోగ్య శాఖలతో సమన్వయ సమీక్షలు నిర్వహించి కాలుష్య నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. జనతా వారధి ద్వారా ప్రజలు తెలియజేస్తున్న సమస్యలను సాధారణ ఫిర్యాదులుగా కాకుండా ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ముఖ్యమైన అంశాలుగా పరిగణించి సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో, కృష్ణాజిల్లా జనతా వారధి కో కన్వీనర్ ఘంటా సతీష్, జనతా వారధి లీగల్ సెల్ కన్వీనర్ గురువిందపల్లి విజయబాబు, పెడన నియోజవర్గ జనతా వారధి కన్వీనర్ ప్రత్తిపాటి వెంకటరమణ, సీనియర్ నాయకులు శ్రీరామచంద్రమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా డా. జి.పద్మశ్రీ



**(వి న్యూస్ – మచిలీపట్నం):** మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సూపరింటెండెంట్ గా డా. జి.పద్మశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీ నుండి పదోన్నతి పై మచిలీపట్నం జిజిహెచ్ సూపరింటెండెంట్ గా నియమితులైన విషయం విదితమే. ఈ సందర్భంగా డాక్టర్ లీల ప్రసాద్,జి జి హెచ్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ ఎం ఓ) డాక్టర్ జి. బాను మూర్తి, ఇతర వైద్యులు ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం నూతన సూపరింటెండెంట్ డాక్టర్.పద్మశ్రీ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో ఆసుపత్రి అభివృద్ధి కి కృషి చేస్తానని తెలియచేశారు.

# రోటరీ యువజనోత్సవాలలో ఎ.ఎ .ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ




**(వి న్యూస్ – గుడ్లవల్లేరు):** సెప్టెంబర్ 19వ తేది నుండి 30వ తేది వరకు గుడివాడ రోటరీ క్లబ్ వారు నిర్వహించిన యువజనోత్సవాలలో గుడ్లవల్లేరు ఎ.ఎ .ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ ఇం .మీ స్కూల్ విద్యార్థులు పోటీలు జరిగిన మొత్తం 20 అంశాలలో 18 అంశాలలో బహుమతులు సాధించి తమ ప్రతిభను చాటారు.క్లాసికల్ జూ. గ్రూప్ డాన్స్, సీనియర్ సోలో సాంగ్ లలో ప్రథమ బహుమతులు, జూనియర్ ఫోక్ గ్రూప్, జూనియర్ ఫ్యాన్సీ డ్రెస్, సీనియర్ ఫ్యాన్సీ డ్రెస్, ఇంగ్లీష్ వక్తృత్వం, సీనియర్ క్లాసికల్ గ్రూప్ సాంగ్, స్పెల్ బీ అంశాలలో ద్వితీయ బహుమతులు, తెలుగు వక్తృత్వం, సబ్ జూనియర్ క్లాసికల్ సోలో డాన్స్, సీనియర్ ఫోక్ గ్రూప్ డాన్స్, జూనియర్ క్లాసికల్ సోలో సాంగ్ అంశాలలో తృతీయ బహుమతులు సాధించారు.సీనియర్ క్లాసికల్ గ్రూప్ డాన్స్, జూనియర్ ఫ్యాన్సీ డ్రెస్, స్పెల్ బీ, జూనియర్ క్లాసికల్ సోలో సాంగ్, సీనియర్ క్లాసికల్ గ్రూప్ సాంగ్, స్పాట్ పెయింటింగ్ లలో కన్సోలేషన్ బహుమతులు సాధించారు. విద్యార్థులకు పటిష్టమైన శిక్షణను ఇచ్చిన టీచర్స్ శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, నాగశ్యామల, వజ్రధరరావు, బాల, నాగకన్య, బి.రామరావు, జ్యోతి, ఆంటోని, గిరీష్, భూపాలరెడ్డి ,వెంకటలక్ష్మి, సుష్మ లను యాజమాన్యం , ప్రిన్సిపాల్ , డైరెక్టర్ అభినందించారు.

# ఇంజనీరింగ్ విద్యార్థికి ఐదువేలు ఆర్థిక సాయం

**(వి న్యూస్ - గూడూరు):** గూడూరు మండలం, కృష్ణా జిల్లా రాయవరం గ్రామానికి చెందిన కొత్త నాగ వెంకట అనిల్ కమార్ తన తాతగారి ఇంటివద్ద నుండి మచిలీపట్నం వై జె ఆర్ డి యం యస్ ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సి య్ సి (ఏ ఐ , డి యస్ ) చదువుతున్న విద్యార్థికి తండ్రి లేరు ఆర్థికంగా తల్లి సంపాదించే ఆదాయం చాలిచాలక కళాశాల దూరంగా ఉండటంతో వెళ్ళిరావడానికి ప్రయాణఖర్చుల ఆర్థిక భారంతో చదువుకోవడం మనవడికి ఇబ్బందిగా ఉందని తాత చిదంబర రావు బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీసైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి దృష్టికి తీసుకునిరాగ



నేడు కప్పలదొడ్డి లో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక ఇబ్బందులు వల్ల విద్యార్థి చదువు ఆటంకం కలగకుండా ఉండేలా ప్రయాణ ఖర్చులకు పేరిశెట్టి నాగరవి ఐదువేలు నగదును విద్యార్థికీ అందజేసి బాగా చదువుకుని జీవితంలో స్థిరపడిన తరువాత సమాజానికి ఎంతోకొంత సేవచేయాలని ఆకాంక్షను వెలిబుచ్చారు. విద్యార్థిని ప్రోత్సహించి చదువుకు ఆటంకం లేకుండా చేసిన నాగరవి కి తాత చిదంబరం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరిశెట్టి నాగరవి ,బూసం సాయిబాబు, బళ్ళ నాగేశ్వరరావు,అనిల్ ,చిదంబరం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీ ఆదాయం రూ.27,82,267/-

**(వి న్యూస్ - వేమవరం):** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను సోమవారం ఉదయం 9.00 గంటలకు కే.శ్రీనివాస రావు, తనిఖీదారు, సూపర్వైజర్ మచిలీపట్నం వారి పరివేక్షణ లో శ్రీ అమ్మ వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీ అమ్మ వారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు, సభ్యులు కళ్ళేపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, ముంగం ఆంజనేయులు, తూము రాజ్యలక్ష్మీ, నూతలపాటి లక్ష్మీ పావని, పెన్నేరు వీర వెంకట నాగ లీల శేఖర్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, వడ్లమన్నాడు ఇండియన్ బ్యాంక్ సిబ్బంది సమక్షమున తెరిచి లెక్కించగా మొత్తం 64 రోజులకు గాను నోట్లు ద్వారా రూ.25,16,520/-లు, చిల్లర ద్వారా రూ.2,65,747/-లు వెరసి మొత్తం రూ.27,82,267/-లు, అమ్మవారి అన్నదానం హుండీ ద్వార నోట్లు రూ.59,660/- , చిల్లర ద్వార రూ.4,620/- వచ్చియున్నది. సదరు హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, వుయ్యూరు, గుడ్లవల్లేరు, వేమవరం సేవా సమితి వారు, వేమవరం గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. దేవాదాయ ధర్మదాయశాఖా కమిషనర్ వారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 8.00 ల నుండి వర్షాలు సంవృధిగా పడుటకు శ్రీ అమ్మవారి సన్నిధిలో వరుణయాగం ,వరుణజపం నిర్వహించబడును అని ఆలయ దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన రావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు లు తెలిపారు.



# గన్నవరం సీహెచ్‌సీ రూపురేఖలు నెల రోజుల్లో మార్చాలి - విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ

**(వి న్యూస్ - గన్నవరం):** గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) రూపురేఖలు నెల రోజుల్లో మారేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ మేరకు గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన, అభివృద్ధి పనులు ఏ విధంగా చేపట్టాలనే దానిపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో రహదారుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, క్యాజువాలిటీ భవన నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, ఇతర అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర పనులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి ఒకే మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచాలని తెలిపారు. సీహెచ్‌సీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమాన్ని నిర్ణయించి, ఏ పని ఎప్పుడు ప్రారంభించాలి, ఎప్పటిలోగా పూర్తి చేయాలనే దానిపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా క్యాజువాలిటీ భవన నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు లేకుండా రహదారులు, పార్కింగ్, పచ్చదనం తదితర సౌకర్యాలను మెరుగుపరచాలని చెప్పారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీహెచ్‌సీ అభివృద్ధికి అవసరమైన అన్ని అంశాలను ఒకే ప్రణాళికలో భాగంగా రూపొందించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిర్ణయించిన పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని, నెల రోజుల్లో సీహెచ్‌సీలో స్పష్టమైన మార్పులు కనిపించేలా పనుల పురోగతి ఉండాలని ఆదేశించారు. గన్నవరం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా సీహెచ్‌సీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు.



# ఏడాదిలో ప్రతి ఇంటికీ తాగునీరు
## - ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**(వి న్యూస్ - పిడుగురాళ్ల):** మాచర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ప్రతి ఇంటికి శుద్ధమైన తాగు జలాలను అందించే లక్ష్యంగా జల్జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ నిర్మాణం జరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని పేటసన్నెగండ్ల అడ్డరోడ్డు వద్ద పల్నాడు వాటర్ గ్రిడ్ పైపు లైన్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 850 కోట్ల రూపాయలతో అన్నీ గ్రామంలో ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగు జలాలను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో వేలకోట్ల నిధులు అందించి, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమాన్ని అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు వెనుకబడిన మాచర్ల నియోజకవర్గం ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. సాగు,తాగునీరు ప్రాజెక్టుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలో వరికశెల ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పంగులూరి అంజయ్య,పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము మునుగోటి సత్యం, గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ తదితరులు పాల్గొన్నారు.





# బోధి పాఠశాలలో గంప నాగేశ్వరరావు ప్రేరణాత్మక కార్యక్రమం

**(వి న్యూస్ - పిడుగురాళ్ళ):** పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని బోధి పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకమైన ప్రేరణాత్మక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రేరణాత్మక వక్త గంప నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకుని, దానిని సాధించేందుకు క్రమశిక్షణతో, నిరంతర కృషితో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, కొత్త విషయాలను నేర్చుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. అలాగే పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య మంచి అనుబంధం ఎంతో ముఖ్యమని ఆయన వివరించారు. తల్లిదండ్రులు పిల్లలపై కేవలం చదువు, మార్కుల విషయంలో ఒత్తిడి చేయకుండా, వారి ఆలోచనలు, భావాలు, ఆసక్తులను అర్థం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు సమయం కేటాయించి వారితో స్నేహపూర్వకంగా మాట్లాడినప్పుడే వారి సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను కేవలం విద్యార్థులుగా కాకుండా, వారి ప్రత్యేకతలను అర్థం చేసుకుని ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి పిల్లవాడి సామర్థ్యం, నేర్చుకునే విధానం భిన్నంగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఒకే లక్ష్యంతో కలిసి పనిచేసినప్పుడే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (అ ఐ) ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని ఆయన తెలిపారు. విద్యార్థులు ఎ ఐ గురించి అవగాహన పెంచుకుని, దానిని సృజనాత్మకంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు ఎ ఐ భవిష్యత్తులో అందించే అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాల మేడమ్ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయడం ఎంతో అవసరమని అన్నారు. పిల్లలకు మంచి విద్యతో పాటు మంచి విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడమే పాఠశాల లక్ష్యమని తెలిపారు. గంప నాగేశ్వరరావు ప్రేరణాత్మక సందేశం, ఎ ఐ పై ఆయన అందించిన అవగాహనతో పాటు పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఉండాల్సిన అనుబంధంపై చేసిన సూచనలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి. ఈ కార్యక్రమం అందరికీ స్ఫూర్తినిచ్చేలా విజయవంతంగా జరిగింది.




# 15 ప్రాంతాల్లో సేవా సేతు అభియాన్ క్యాంపులు
## - పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ
## - పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన

**(వి న్యూస్ - విజయవాడ) :** పీఎం సూర్య ఘర్ -- ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "సేవా సేతు అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 4 సబ్ డివిజన్ల పరిధిలోని 15 ప్రాంతాల్లో సేవా సేతు అభియాన్ క్యాంపులు జరగనున్నాయి. ఈ సందర్భంగా సేవా సేతు అభియాన్ పోస్టర్‌ను కలెక్టర్ జి.లక్ష్మీశ సోమవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించే క్యాంపుల ద్వారా పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించవచ్చని కలెక్టర్ అన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30,000, 2 కిలోవాట్లకు రూ.60,000, 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక క్యాంపుల్లో ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయనున్నారని.. అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పథకానికి సంబంధించిన మరింత సమాచారం కోసం ఏపీసీపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ యు.హనుమయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, విశ్వేశ్వరప్రసాద్, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# అరసవల్లి ఆలయ అభివృద్ధికి రూ.55.74 కోట్లు..
## రెండేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి: రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం :** అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఈరోజు(సోమవారం) దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఇంద్ర పుష్కరిణి సందర్శించిన అనంతరం ఆలయ అధికారులు, అర్చకులతో ఆలయ అభివృద్ధిపై రివ్యూ నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకారంతో స్వదేశీ దర్శనం 2.0 కింద అరసవల్లి ఆలయానికి రూ.55.74 కోట్లు కేటాయించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర టూరిజం మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు శ్రీకాకుళం జిల్లా ప్రజలు తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో అరసవల్లి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని గత రెండేళ్లుగా చేసిన కృషికి ఇది ఒక మైలురాయిగా చెప్పుకొచ్చారు. స్వదేశీ దర్శనం ప్రాజెక్ట్‌ను పూర్తి శాతం సంపూర్ణంగా వినియోగిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. రెండు సంవత్సరాలలోపే ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే ఆలోచనతో కార్యాచరణ రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయానికి దేశ, విదేశాల నుంచి భక్తుల తాకిడి పెరుగుతోందన్నారు. ప్రతి ఆదివారం 30 వేల మంది భక్తులతో దర్శనాలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో భక్తులు ఎక్కువగా రావడానికి తగు సౌకర్యాలు కోసం ప్లాన్ చేస్తున్నామని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని కేంద్ర మంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం ఆలయాలపై మంచి ఆలోచనతో పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తోందని తెలిపారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి పెట్టడం చాలా సంతోషమన్నారు. రాష్ట్రంలో ఒక ప్రతిష్ఠాత్మకమైన ఆలయంగా తయారు చేసే నమ్మకం తమకు ఉందన్నారు. ఇప్పటికే ఇంద్ర పుష్కరిణికి రూ.4 కోట్లతో పనులు జరిపిస్తున్నామని తెలిపారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279